ప్రజాశక్తి

గురువారం 15 మే 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

బడులపై రేషనలైజేషన్ వేటు

- ఉపాధ్యాయ పోస్టుల కుదింపే లక్ష్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో పెద్ద ఎత్తున మిగులు పోస్టులు
- పాఠశాల విద్యలో సంస్కరణలపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి-గుంటూరు

పాలకులు ఎవరైనా ప్రభుత్వ విద్య నిర్వీర్యంవైపే అడుగులు వేస్తున్నారు. గత ప్రభుత్వం 117 జిఒ పేరుతో, ఈ ప్రభుత్వం పాఠశాలల వర్గీకరణ పేరుతో ఉపాధ్యాయుల కుదింపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ విద్య బలోపేతం కావాలంటే ఉపాధ్యాయులను పూర్తి స్థాయిలో అందించాలని సంఘాలు, విద్యావేత్తలు కోరుతుంటే ప్రభుత్వం మాత్రం కత్తిరింపు చర్యలు చేపడుతోంది. జిల్లాలో ఇటీవల చేపట్టిన పాఠశాలల రేషనలైజేషన్, వర్గీకరణ ప్రక్రియలో సుమారుగా వెయ్యి మంది ఉపాధ్యాయులు అదనంగా ఉన్నట్లు తేల్చారు. దీంతో వారిని సర్దుబాటుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యార్థులు తక్కువగా ఉన్నారనే సాకుతో పోస్టులను తగ్గించటం సరికాదని, విద్యార్థుల సంఖ్యను పెంచటంపై దృష్టి సారించాలని సర్వత్రా కోరుతున్నారు.

గత ప్రభుత్వం 117 జిఒ పేరుతో ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల్ని పెద్ద సంఖ్యలో హైస్కూల్స్‌లో విలీనం చేయడంతో 1, 2 తరగతులతో మిగిలిన ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ఈ జిఒను రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేసినా దానిని మరో రూపంలో అమలు చేస్తోంది. పాఠశాలలను వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేసింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఈ వర్గీకరణ చేపట్టటం గమనార్హం. ప్రాథమికోన్నత పాఠశాలలు కొన్ని అప్‌గ్రేడ్ చేయటం, విద్యార్థుల సంఖ్య

2లో





పొమ్మనకుండా పొగబెట్టే చర్యలు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వం ఒక పథకం ప్రకారం వెళ్లగొట్టే చర్యలు మానుకోవాలి. రకరకాల సంస్కరణలతో విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం అవుతోంది. గత ప్రభుత్వం చేపట్టిన విధానాల వల్ల వేలాది మంది విద్యార్థులు ప్రైవేటు బాట పట్టారు. ప్రస్తుత ప్రభుత్వమూ ఉపాధ్యాయుల సంఖ్యను కుదించింది. గతప్రభుత్వం హైస్కూల్స్‌లో విలీనం చేసిన 3, 4, 5 తరగతుల్ని తిరిగి ప్రాథమిక పాఠశాల్లో కలిపితే సరిపోయేది. కానీ రకరకాల వర్గీకరణలతో గందరగోళం సృష్టిస్తోంది. తెలుగు మీడియం రద్దు చేయటం, హైస్కూల్స్‌లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని 1:45 నుండి 1:53కు పెంచటం వల్ల పోస్టులు మిగిలాయి.

యు.రాజశేఖర్‌రావు, యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు



వడ్డమాను గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

భూమి ఇచ్చేందుకు చేతులెత్తని రైతులు

- ప్రభుత్వాలు మారితే మా గతేం కావాలి?.. మాకు జీవనాధారం ఏమిటి?
- 'భూసమీకరణ' సభల్లో పలు అంశాలపై రైతుల ప్రశ్న
- మరోసారి సభలు నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -తుళ్లూరు

'రాజధాని నిర్మాణానికి పదేళ్ల క్రితం భూములు తీసుకున్నారు. ఇప్పటికీ రాజధాని అమరావతికి చట్టబద్ధత లేదు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాజధాని పరిస్థితి ఏమిటో చూశాం. రైతులు పడిన కష్టాలు తెలుసు. ఇప్పుడు మేము కూడా భూములిస్తే.. రేపు ప్రభుత్వాలు మారితే మా గతేమీ కావాలి' అని అధికారులను, ఎమ్మెల్యేను రైతులు ప్రశ్నించారు. ప్రభుత్వం మారినా రాజధాని నిర్మాణ పనులు ఆగకుండా ఎలా కొనసాగిస్తారో చెప్పాలని కోరారు. మండల పరిధిలోని వడ్డమాను, పెదపరిమిలో భూ సమీకరణపై బుధవారం గ్రామసభలు జరిగాయి. మండలంలో 21 గ్రామాలుండగా (రెండు శివారు గ్రామాలు) కేవలం వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలనే ల్యాండ్ పూలింగ్ (భూ సమీకరణ) నుంచి ప్రభుత్వం మినహాయించింది. ప్రస్తుతం ఈ గ్రామాల భూములను రైతుల అభిప్రాయాల మేరకు భూసమీకరణ లేదా భూ సేకరణ ద్వారా తీసుకుంటామని ప్రకటించింది. ఇందుకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం హరిశ్చంద్రపురంలో గ్రామసభ నిర్వహించగా బుధవారం వడ్డమాను, పెదపరిమిలో జరిపారు. వడ్డమానులో గుంటూరు ఆర్‌డిఒ

2లో

ప్రభుత్వ నిర్లక్ష్యం.. కంపెనీలు సిండికేటు..

- ధరల్లేక, కాపాడుకోలేక పొగాకు రైతుల పాట్లు
- పల్నాడు కలెక్టరేట్ వద్ద నేడు నల్లబర్లీ పొగాకు రైతుల ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నల్లబర్లీ పొగాకును మద్దతు ధరకు ప్రభుత్వమే కొనాలని కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకష్ణ, రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కారణంగా ఏ పంటకూ మద్దతు ధర దక్కక రైతుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. నల్లబర్లీ పొగాకును కొనేవారు లేరని, ఈ క్రమంలో రైతులు అప్పులు తీర్చలేక, పొగాకు దెబ్బతినకుండా కాపాడుకోలేక అనేక పాట్లు పడుతున్నారని చెప్పారు. పొగాకు కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో కంపెనీలు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి రైతులను లూటీ చేస్తున్నాయని విమర్శించారు. కంపెనీ ప్రతినిధుల మాటలు నమ్మి చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు పొగాకును అధికంగా సాగు చేశారన్నారు. విత్తనం నుండి మార్కెట్ వరకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే నంటూ గ్రామాల్లో రైతు సేవాకేంద్రాలను ఏర్పాటు చేసి, ఈ-క్రాప్ నమోదు చేస్తూ కొనుగోళ్లు మాత్రం దళారుల దయా దాక్షిణ్యాలకు ప్రభుత్వాలు వదిలేస్తున్నాయని మండిపడ్డారు. పొగాకు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి ఇటీవల ఆదేశించినా, కొనుగోళ్ల పరిశీలనకు అధికారులను నియమించి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినా విధివిధానాలు మాత్రం రూపొందించ లేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పొగాకుకు మద్దతు ధర ప్రకటించి కంపెనీలతో కొనుగోలు చేయించాలని, పొగాకు సాగైనా అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను తెరవాలని, నాణ్యత పేరిట వెనక్కి పంపకుండా మొత్తం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గతం మాదిరి రవాణా ఛార్జీలు, పాస్‌లు ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు. కౌలురైతులకు ప్రాధాన్యమివ్వాలని, అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చేపట్టిన ధర్నాను రైతులు జయప్రదం చేయాలని కోరారు.

రైతులతో శాస్త్రవేత్తలు మమేకమవ్వాలి

వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు



సీడీలను ఆవిష్కరిస్తున్న ఢిల్లీరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైతుల సమస్యలకు రాష్ట్రంలోని కృషి విజ్ఞాన కేంద్రాల్లో పరిష్కారం చూపాలని వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు కోరారు. లాంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన 23 కృషి విజ్ఞాన కేంద్రాల అధికారుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాపులో వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం, వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం అధికారులతో పాటు పలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు. ఢిలీరావు మాట్లాడుతూ వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో తరచూ మమేకమై వారికి ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారం కనుగొనాలన్నారు. ప్రతి ఏటా వివిధ రకాల పైర్లపై చీడపీడల తాకిడి పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ శారదా జయలక్ష్మి మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాల్లో జరిగే పరిశోధనల ఫలాలు రైతులకు అందాలన్నారు. రైతుల సమగ్రాభివృద్ధికి తోడ్పడేలా వారిని కలుపుకొని వెళ్లాలని కోరారు. రైతులకు ఎదురయ్యే సందేహాలను సత్వరం నివృత్తి చేయాలన్నారు. విస్తరణ సంచాలకులు జి.శివన్నారాయణ మాట్లాడుతూ లాభదాయకమైన వ్యవసాయం జరిగేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. ఫలితాలకు తగ్గట్టుగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన వంగడాలు, ప్రణాళికలకు సంబంధించిన సిడిలను ఢిల్లీరావు, శారదా జయలక్ష్మి ఆవిష్కరించారు.

ఉపాధి హామీ రక్షణ కోసం 20న సమ్మె

- చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి
- పని ప్రదేశాలను సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం
- ఏప్రిల్‌లో పనులకు డబ్బులింకా రాలేదని కూలీల ఆవేదన

2 లో



కూలీలతో మాట్లాడుతున్న అప్పారావు

నేటి నుంచి 18 వరకు పెమ్మసాని పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఈనెల 15 నుంచి 18 వరకు జిల్లాలో పర్యటించనున్నారు. 15వ తేదీ గురువారం 12 గంటలకు గుంటూరు ఐటీసి వెల్కమ్ హోటల్‌లో భూములు సర్వే, రీసర్వే భూ రికార్డుల డిజిటలైజషన్ పై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగే వర్క్ షాప్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర గ్రామీణభివృద్ధి శాఖ అధికారులతో కలసి వట్టిచెరకూరు మండలం అనంతవరప్పాడు, లెమల్లెపాడు గ్రామాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తారు. సాయంత్రం 4.30 గంటలకు తిమ్మాపురంలో మల్టీ పర్పస్ గౌడౌన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. 6 గంటలకు పెదనందిపాడు మండలం నాగులపాడులో ఎన్‌టిఆర్ విగ్రహా విష్కరణలో పాల్గొంటారు. 16వ తేదీన గెయిల్ సంస్థ ఆధ్వర్యంలో సాయంత్రం 5 గంటలకు బాలాజీనగర్‌లో మొబైల్ మెడికల్ వాహనాలను ప్రారంభిస్తారు. 17వ తేదీ ఉదయం 8 గంటలకు కూటమి పార్టీల ఆధ్వర్యంలో గుంటూరు మార్కెట్ సెంటర్‌లో తిరంగారన్‌లో పాల్గొంటారు. ఉదయం 10 గంటలకు గుంటూరు బొంగరాలాబీడు స్మశానవాటికలో ఎలక్ట్రికల్ క్రిమెషన్ సెంటర్ ప్రారంభోత్సవం, 11 గంటలకు ప్రభుత్వ ఆస్పత్రిలో సమావేశం, సాయంత్రం 5 గంటలకు ప్రత్తిపాడులో కమ్యూనిటీ హాలు శంకుస్థాపన చేస్తారు. 18వ తేదీన గుంటూరులోని ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందు బాటులో ఉంటారు.

రిటైర్డు డిసిపిపై విచారణకు ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో డిసిపిగా పనిచేసి రిటైర్డు అయిన బి.సత్యనారాయణపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈమేరకు బుధవారం మునిసిపల్‌పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021లో టిడిఆర్ బాండ్ల జారీలో అక్రమాలపై విచారణ చేపట్టారు. అప్పట్లో గుంటూరులోని కుర్రా చంద్రశేఖర్‌కు జారీ చేసిన టిడిఆర్ బాండ్లలో అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. ఈమేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డైరక్టర్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ను ఆదేశించారు.



జాతీయ పశు వ్యాధినియంత్రణ పథకాన్ని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా పశువుల ఆరోగ్యం, వ్యాధి నిర్ధారణ, నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఒక పథకాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఈ పథకం ద్వారా, పశువుల్లో వచ్చే అంటు వ్యాధులను నియంత్రించి పశువు ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యమని రొంపిచర్ల మండల పశు వైద్యాధికారి డాక్టర్ డి.వంశీ ప్రసాద్ అన్నారు. రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు గ్రామంలో బుధవారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం, రక్త నమూనాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా మార్చి, ఏప్రిల్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా పశువులకు 34 విడత ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రతి జిల్లాలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి ఆయా గ్రామాలలో పశువుల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్ లో పరీక్షించడం ద్వారా క్షేత్రస్థాయిలో టీకాల నిర్వహణ నిర్ధారించడం జరుగుతుందన్నారు. రక్త నమూనాల పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారించవచ్చున్నారు. డిప్యూటీ డైరెక్టర్ వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నుండి డాక్టర్ పి. సనిల కుమారి, పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కళావతి ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పశువుల ఆరోగ్యం మెరుగుపరచడం ద్వారా పశు సంవర్ధక రంగంలో పర్యావరణాన్ని కాపాడడంతో పాటు పశు పోషకులకు ఆర్థికాభివృద్ధి సాధించడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-గుంటూరు

అగ్నిప్రమాదం సంభవించినపుడు ఏవిధమైన నష్టనివారణ చర్యలు తీసుకోవాలని అనే అంశంపై బుధవారం కలెక్టరేట్‌లో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి విలేకరులతో మాట్లాడుతూ వరదలు , తుపానులు , అగ్నిప్రమాదాలు వంటి ప్రకతి విపత్తులు సంభవించినపుడు ప్రజల్లో అవగాహన కల్పించి వీలైనంత వరకు నష్టాన్ని తగ్గించడానికి ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా వున్నాయని , ఎందుకంటే సిబ్బంది ఎలక్ట్రికల్ కనెక్షన్‌లు అలాగే వుంచేసి కంప్యూటర్ , ప్రింటర్స్ వంటి వాటిని అలాగే వదిలేసి వెళతారని, పవర్ సప్లయ్ లోపాలతో షార్ట్ సర్క్యూట్ జరుగుతుందన్నారు. ఎలక్ట్రికల్ బోర్డును అప్పుడప్పుడు తనిఖీ చేస్తూ వుండాలని, లేకపోతే ఇటువంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలు వుంటాయన్నారు. ఏదైనా కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగితే వెంటనే అగ్నిమాపక శాఖకు తెలియజేస్తే ప్రమాదాన్ని అరికట్టవచ్చున్నారు. ప్రతి కార్యాలయంలో ఫైర్ ఎక్విప్మెంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు.జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినపుడు ప్రాణ, ఆస్తి నష్టనివారణ ప్రధాన ఉద్దేశమన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజల్ని కాపాడే విధానాన్ని కూలంకషంగా వివరించారు.



ఉద్యోగుల్ని స్ట్రెక్చర్‌పై తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కార్యక్రమాన్ని విపత్తుల నిర్వహణ ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.లక్ష్మీకుమారి, డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, ఏఆర్ డిఎస్‌పి ఏడుకొండలరెడ్డి, ఆర్‌ఎఫ్ఓ జిలానీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బడులపై రేషనలైజేషన్ వేటు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉన్న మున్సిపల్ పాఠశాలల్లో పోస్టుల సంఖ్య పెంచటంపై, కొన్ని పోస్టులను అప్‌గ్రేడ్ చేయటంపై హర్షం వ్యక్తం అవుతున్నా అదే సందర్భంలో జెడ్పీ, ప్రభుత్వ, మండల పరిషత్ పాఠశాలల్లో పోస్టుల సంఖ్యను కుదించటంపై విమర్శలు వస్తున్నాయి.

పాఠశాలల వర్గీకరణ ఇలా...

కూటమి ప్రభుత్వం పాఠశాలలను వివిధ రకాలుగా వర్గీకరించింది. రానున్న విద్యా సంవత్సరం నుండే ఆయా పాఠశాలలను కొత్త పేర్లతో పిలవనున్నారు. దీనిలో 1-5 తరగతులతో ఉండేవి బేసిక్ ప్రైమరీ స్కూళ్లుగా పిలుస్తున్నారు. ఇవి ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1597 స్కూల్స్ ఉన్నాయి. వీటిలో 20 మంది విద్యార్థులకు ఒక టీచర్ 21-60 మందికి ఇద్దరు టీచర్లను ఇస్తారు. మరో వర్గీకరణలో ప్రభుత్వం కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేసింది. ఇవి 711 పాఠశాలలు ఉన్నాయి. 45 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలను మోడల్ స్కూల్స్‌గా ఎంపిక చేశారు. వీటికి మొదట ఒక హెచ్‌ఎం ఐదుగురు ఎస్‌జిటిలను ఇస్తామని చెప్పినా తీరా ఒక హెచ్‌ఎం, నలుగురు ఎస్‌జిటిలనే కేటాయించారు. 150 మంది విద్యార్థుల సంఖ్య దాటితేనే మోడల్ స్కూల్స్‌లో అదనంగా ఐదవ ఎస్‌జిటి పోస్టు ఇస్తారు. ఫౌండేషన్ స్కూల్స్‌గా పిలిచే పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే ఉంటాయి. ఇవి 253 ఉన్నాయి. ఉన్నత పాఠశాలలు 469 ఉన్నాయి. ప్రీ ప్రైమరీ (శాటిలైట్) పాఠశాలలు 4 ఉన్నాయి. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలో 56 యూపీ స్కూల్స్‌ను హైస్కూల్స్‌గా అప్‌గ్రేడ్ చేశారు.

వెయ్యి మందికిపైగా ఉపాధ్యాయులు మిగులు..

ప్రభుత్వం చేపట్టిన ఈ వర్గీకరణ, రేషనలైజేషన్ వల్ల సుమారుగా వెయ్యి మంది ఉపాధ్యాయులు మిగులుగా ఉన్నారని తేలింది. ఇటీవల ప్రకటించిన డిఎస్‌సిలో 1143 పోస్టులు మినహాయించినా ఇంత పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయుల మిగులు ఉండటం గమనార్హం. రేషనలైజేషన్ ప్రక్రియ వల్లే ఈ పోస్టులు మిగులు తేలాయనే విమర్శలు వస్తున్నాయి. కాగా ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో దాదాపు 400 మంది మిగులుగా తేలగా, వారిని కాంప్లెక్స్ స్కూల్స్‌కు సర్దుబాటు చేస్తున్నారు. అయితే ఖాళీగా ఉన్న మిగులు ఉపాధ్యాయ పోస్టుల అంశం ప్రశ్నార్థకంగా మారింది. జెడ్పీ, మండల పరిషత్‌ల యాజమాన్యాలల్లోనే అత్యధికంగా మిగులుగా తేలాయి. వాటిలో కొన్నింటిని మున్సిపల్ యాజమాన్యంలో చూపించటానికి చర్యలు తీసుకున్నారు. అయినా ఇంకా పోస్టులు మిగులుగా తేలుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 14,761 మంజూరైన ఉపాధ్యాయ పోస్టులు ఉండగా, 12,968 మంది పనిచేస్తున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9, మున్సిపాల్టీలలో 32, ప్రభుత్వ యాజమాన్యంలో 23, జెడ్పీలో 463, ఎస్‌జిటి పోస్టులు 190 మిగులుగా తేల్చారు. వాటిలో ఆయా పోస్టులలో కొన్నింటిని మున్సిపాల్టీలు, మున్సిపల్ కార్పొరేషన్లకు కన్వర్ట్ చేసినా ఇంకా 234 పోస్టుల వరకూ మిగులు ఉన్నట్లు తెలిసింది. వివిధ కేటగిరీల పాఠశాలలకు ఉపాధ్యాయుల కేటాయింపులపై సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మోడల్ స్కూల్స్‌లో 50 మంది ఉన్నా ఐదుగురే, 150 ఉన్నా ఐదుగురే ఉపాధ్యాయుల్ని ఇస్తున్నారు. హైస్కూల్స్‌లో గతంలో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇచ్చేవారు. ఇప్పుడు 53 ఉండాలని నిబంధన విధించడంతో మిగులు ఉపాధ్యాయుల సంఖ్య పెరిగింది. మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో సీనియర్ ఎస్‌జిటికి హెచ్‌ఎంగా ఇవ్వకుండా, స్కూల్ అసిస్టెంట్‌గా ఇవ్వటంపైనా అభ్యంతరాలు వస్తున్నాయి.

భూమి ఇచ్చేందుకు చేతులెత్తని రైతులు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీనివాసరావు మాట్లాడుతూ నంబూరు-ఎర్రుపాలెం రైల్వేలైన్ కోసం వడ్డమాను పరిధిలో 11 ఎకరాలు తీసుకోవాల్సి ఉందని, ఇందులో ఎకరం భూమి ప్రభుత్వానిదని, మిగిలిన 10 ఎకరాలు రైతులదని చెప్పారు. రైతుల అభిప్రాయాల కనుగుణంగా భూములు తీసుకుంటామని చెప్పారు. రైల్వేలైన్ కోసమే కాకుండా రాజధాని నిర్మాణానికి భూములు తీసుకునేందుకు గ్రామ సభలని అన్నారు.

ఈ సందర్భంగా పలువురు రైతులు పలు అంశాలపై సందేహాలను లేవనెత్తారు. ఆళ్ల పూర్ణచంద్రరావు అనే రైతు మాట్లాడుతూ తొలివిడత తీసుకున్న భూముల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశాక 2029లో రెండో విడత భూములు తీసుకుంటే బాగుంటుందని అన్నారు. కొమరబత్తిన శేఖర్‌బాబు మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి భూములు తీసుకుంటే కౌలురైతులు, పేదల జీవనాధారం ఏమిటని ప్రశ్నించారు. భూమిలేని పేదలకు పింఛను రూ.10 వేలు ఇవ్వాలని కోరారు. శ్రీనివాసరెడ్డి అనే రైతు మాట్లాడుతూ ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు సంబంధించిన వెంచర్లకు బ్యాంకు అధికారులు రుణాలిస్తూ రిజిస్ట్రేషన్ చేసిన రైతుల ప్లాట్లకు ఇవ్వడం లేదని చెప్పారు. నీరుకొండ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ గ్రామసభల గురించి రైతులు, గ్రామస్తులకు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని, దీనిని బట్టి గ్రామసభలకు వారు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తోందని అన్నారు. రైతుసమస్యలపై సిఆర్‌డిఎ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ సిఆర్‌డిఎ అధికారులు, రైతులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కౌలు రైతులు, భూమి లేని పేదలకు పింఛను ఇస్తామని, శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉందని, రాజధాని నిర్మాణానికి మోడీ భుజంభుజం కలుపుదామని చెప్పారని అన్నారు. భూములు ఇచ్చేందుకు సానుకూలంగా ఉండేవారు చేతులు ఎత్తాలని కోరగా ఎవ్వరూ ఎత్తలేదు. దీంతో సమగ్ర ప్రణాళికతో మరోసారి వస్తామని చెప్పి సభను ముగించారు. అనంతరం పెదపరిమిలో గ్రామసభ జరిగింది. సభలో రైతులు బెల్లంకొండ శ్రీనివాసరావు, మున్నంగి శ్రీనివాసరెడ్డి తదితరులు మాట్లాడారు. భూములు తీసుకునే ప్రక్రియ జరిగినంత వేగంగా అభివృద్ధి జరగడం లేదని అన్నారు. మరోసారి సభ నిర్వహిద్దామని రైతులకు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుజాత, ఎంపిడిఒ శిల్పా, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ రక్షణ కోసం 20న సమ్మె

చట్టాన్ని నిర్వీర్యం చేసే కేంద్రం కుట్రలను తిప్పికొట్టాలి

పని ప్రదేశాలను సందర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం

ఏప్రిల్‌లో చేసిన పనులకు డబ్బులింకా రాలేదని కూలీల ఆవేదన

ప్రజాశక్తి - ఫిరంగిపురం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెలో ఉపాధి హామీ కార్మికులు భాగస్వాములు కావాలని, అందుకుగాను ఆ రోజు పనులను ఆపేయాలని వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పిలుపునిచ్చారు. మండలంలోని గుండాలపాడు, బేతపూడి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలను నాయకులు బుధవారం పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏప్రిల్ నుండి చేసిన పనులకు డబ్బులు రాలేదని, గతంలో ఇచ్చిన సదుపాయాలు కూడా ఇవ్వటం లేదని కూలీలు తెలిపారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ పని చేసిన 15 రోజుల్లోపు కూలివ్వాలరని, అడిగిన అందరికీ పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ రక్షణతోపాటు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకు రూ.600 కూలివ్వాలని, పలుగు, పారకు, తాగునీరు, మజ్జిగకు డబ్బులు చెల్లించాలని, సమ్మర్ అలవెన్స్ 30 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మేట్‌లకు రూ.5 ఇవ్వాలని, గ్రామం నుండి పని ప్రదేశం 5 కిలోమీటర్లకు మించి ఉంటే ఛార్జీలకు డబ్బులు చెల్లించాలని, ప్రమాదం జరిగితే క్షతగాత్రులకు, మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, బడ్జెట్లో నిధులు తగ్గింపు అందులో భాగమని చెప్పారు. అందరికీ పని కల్పించాలంటే రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో రకరకాల మార్పులు చేస్తూ కూలీలకు పనిపట్ల అనాసక్తి పెంచుతున్నారని, రెండు పూట్ల మస్టర్‌తో ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకునేందుకు మళ్లీ పోరాటాలే మార్గమన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండలం కార్యదర్శి ఎస్‌కె.మస్తాన్‌వలి ,రైతు సంఘం నాయకులు జి.వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగరాజు పాల్గొన్నారు.




దెబ్బతిన్న పిట్టగోడ

పిడుగు ప్రభావానికి దెబ్బతిన్న గోడ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మెరుపులు ఉరుములుతో బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా వర్షం కురిపిస్తుంది. సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడులో పిడుగు ప్రభావానికి ప్రహరీ పిట్టగోడ దెబ్బ తిన్నది. గ్రామ సమీప పొలాల్లో పిడుగు పడిం ది. సత్తెనపల్లి ఏడుకొండలకు చెందిన డిటీహెచ్ కేబుల్ గొడుగుపై పిడుగు రవ్వ పడింది డాబా పైన ఉన్న పిట్ట గోడ దెబ్బతిటంతో పాటు ఇంట్లో ఉన్న ఇంటికి సంబంధించిన వస్తువులు, ఫ్యాన్లు, టీవీలు, సెటప్ బాక్సులు కాలిపోయాయి. ఎలాం టి ప్రాణనష్టం ఆస్తినష్టం లేకపోవడంతో గ్రామ స్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మెడకు ఉరితాళ్లతో పారిశుద్ధ్య కార్మికుల నిరసన

56వ రోజుకు ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని అధికారులు, ప్రజాప్రతినిధులు దిగి వచ్చే వరకు తమ నిరసన శాంతి యుతంగానే వ్యక్తం చేస్తామని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యలు పరిష్కరించా లని కోరుతూ పారిశుద్ధ్య కార్మి కులు నరసరావుపేట పురపాలక సంఘం కార్యాలయం ఎదుట చేపట్టిన చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 56 వ రోజుకు చేరుకుంది. 56 రోజుల నుండి నిర సన వ్యక్తం చేస్తున్నా అధికారులు ప్రజాప్రతి నిధులు, స్పందిం చక పోవటంతో సమ్మె శిబిరంలో సమీపంలో ఉన్న జాతిపిత విగ్రహం వద్ద వినూత్నంగా మెడకు ఉరితాడు వేసుకుని నిర సన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌లో ఉన్న మిగతా కార్మికు లకు రూ.21 వేలు వేతనం ఇస్తున్నప్పటికీ అదే విధానంలో ఆరేళ్లుగా పని చేస్తున్న 40 మంది కార్మికులకు నెలలో 30 రోజు లు పని చేసినా సగం రోజులకే వేతనాలు ఇస్తున్నారనీ, గత్యం తరం లేక శాంతియుత పోరాటం చేస్తున్నామన్నారు. నెల


మెడకు ఉరితాడు బిగించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రోజులు పని చేస్తే 10 నుంచి 15 రోజులకు వేతనం ఇస్తే కార్మి కుల కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏమాత్రం ఫలితం లేదన్నారు. కార్మికుల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తూ కార్మికుల జీవితాలను రోడ్డును పడేస్తున్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులు నిరవధిక సమ్మెకు పూనుకున్న నేపథ్యంలో రోజుకు రూ.700 వేతనం ఇచ్చి ప్రయివేటు వ్యక్తుల చేత పారిశుధ్య పను లు చేయిస్తున్నారనీ, తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందు లకు గురి చేయడం వివక్ష చూపడం ఎందుకన్నారు. కార్మిక చట్టాలు అమలులో ఉన్నప్పటికీ కార్మికుల పరిస్థితి అయో మయంగా తయారైందని అదే నాలుగు లేబర్ కోడ్‌లు అమలు జరి గితే కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారు తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

డాబా పై నుండి పడి యువతి మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

స్థానిక రసూల్ పేటలో నివాసం ఉంటున్న చిన్నా బత్తిని జోత్స్న వేళాంగిణి మేరి (వయస్సు17 సంవత్సరాలు)రాజేష్ బాబు నరసరావుపేట లోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పూర్తి చేసి ప్రస్తుతం సెలవులైనందున తల్లిదండ్రులతో ఫిరంగిపురం రసూల్ పేటలోని వారి ఇంటి వద్ద ఉంటోంది. మంగళవారం తేదీన రాత్రి సుమారు 10.00 గంటల సమ యంలో ఆమె తన తల్లి, చెల్లితో భోజనాలు చేసి వారి డాబా రెండో అంతస్తు పైకి నిద్రపోవడానికి వెళ్లినట్లు, జోత్స్న వేలాం గిని మేరీ తన తల్లి వద్ద ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని తన ఫ్రెండు తో మాట్లాడుతూ డాబా పిట్టగోడపై కూర్చున్నట్టు, ప్రమాద వశాత్తుకింద పడింది. తలపై రక్త గాయమై చెవి నుండి రక్తం కారడంతో చికిత్స నిమిత్తం గుంటూరులోని వికాస్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినది. మృతురాలి తండ్రి ఇచ్చిన స్టేట్మెంట్ మేరకు ఫిరంగిపురం పోలీసు వారు కేసు నమోదు చేశారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించినట్లు ఫిరంగి పురం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ శివరామకష్ణ తెలిపారు.. కేసు దర్యాప్తులో ఉన్నది అని తెలిపారు.

హోమ్‌లను సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియా వుద్దీన్ బుధవారం గుంటూరులోని హోమ్‌లను సందర్శించి, విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దిశా వన్‌స్టాప్ సెంటర్, శిశు గృహంను, స్వధార్ హోమ్, లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షి యల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. శిశు గృహాన్ని లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షియల్ స్కూల్ లో పిల్లలకు అందుతున్న సదుపాయాలను పరిశీలిచారు. అక్కడి అధికారులతో మాట్లాడి పిల్లలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, వారికి ఇచ్చిన రూంలను పరిశీలించారు. దిశా వన్ స్టాప్ సెంటర్‌ను, స్వధార్ హోమ్‌ను సందర్శించి మహిళలకు అందుతున్న సదుపాయాల గురించి వాకబు చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ కట్ట కాళిదాసు, హెూమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెదకూరపాడు ఎంపిడిఓగా ప్రభాకర్

ప్రజాశక్తి - పెదకూరపాడు



పెదకూరపాడు ఎంపిడిఓగా కొండారెడ్డి డేవిడ్ ప్రభాకర్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అం దుకు సిబ్బంది, ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమన్నారు. ఆయన తుళ్లూరులో ఈవోపీ ఆర్డిగా పని చేశారు. ప్రమోషన్‌పై పెద కూ ర ఎండిఓగా విధులలో చేరారు. ప్రభాకర్‌రావును ఏవో సోమ యాజులు, మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్ రావు, ఏపిఎం సునీత, ఏపీవో కోటమ్మ, సిబ్బంది స్వాగతం పలికారు.

తూనికల కొలతల శాఖ అధికారుల తనిఖీ

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని దొడ్లేరు గ్రామంలో తూనికలు కొలతల శాఖ సత్తెనపల్లి ఇన్స్పెక్టర్ షేక్ సైదా మంగళవారం చికెన్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా గ్రామం లోని అల్లా చికెన్ సెంటర్లో తూనికల్లో మోసగిస్తున్నట్లు గుర్తించి నట్లు ఎస్ఐ తెలిపారు. 10కిలోలకు కిలో చొప్పున తూనికల్లో ఎల్ మోడ్ పద్ద తిలో మోసగిస్తున్నట్లు గుర్తించామన్నారు. దుకాణదారుడు షేక్ అల్లాబక్షుపై కేసు నమోదు చేసి మూడు కాటాలను స్వాధీన పరు చుకున్నట్లు తెలిపారు. తూనికల అధికారులు వచ్చారన్న సమా చారం తెలుసుకున్న మిగతా చికెన్ దుకాణాలన్నీ మూత వేసి నట్లు తెలిపారు. రైతులకు, ప్రజలకు వ్యాపారస్తులు మోసాలు చేస్తే వారిపై కేసు నమోదు చేసి అధిక మొత్తంలో జరిమాన విధి స్తామని వారు వ్యాపారస్తు లకు హెచ్చరించారు. ఎవరైన తూనికల్లో మోసాలకు గురైతే ఫోను: 9885127512కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

నేడు కొచ్చర్లలో తిరునాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని కొచ్చర్ల గ్రామంలో నేడు శ్రీ అంకాల పర మేశ్వరి తిరుణాల్లను ఘనంగా నిర్వ హిస్తున్నట్లు గ్రామస్తులు తెలి పారు. ట్రాఫిక్ లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముం దస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సై ఎం ఉమా మహే శ్వరరావు ఆలయ పరిసర ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. కొంద్ర ముట్ల, కొచ్చర్ల గ్రామస్తులు ఆరు భారీ విద్యుత్ ప్రభలను నిర్మిస్తు న్నారు. బందోబస్తు నడుమ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చంద్రబాబు పాలనకు ట్రేడ్‌మార్క్‌గా సంక్షేమ క్యాలెండర్ : జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో కూటమి ప్రభుత్వం ఏడాది సందర్భం నిర్వహిం చు కోబోతున్నందుకు సంతోషంగా ఉందని చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. సంక్షేమ పథకాల అమలు మరింత సమర్థంగా, పారదర్శకంగా ప్రజలందరికీ అందించేందుకు తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరోలో తీసుకున్న కీలక నిర్ణయాలే అందుకు నిదర్శనమన్నారాయన. ప్రజలకు ప్రతి నెలా సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ఏడాది మొత్తానికి సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయాలని నిర్ణయాన్ని విప్లవాత్మకంగా అభివర్ణించారు. పేదలకు వరంగా పేర్కొన్నారు. నియోజక వర్గంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జూన్ 16, 17, 18 తేదీల్లో తలపెట్టిన తిరంగా యాత్రలు, సభలు ప్రజల్లో దేశభక్తిని, సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందిస్తాయని తెలిపారు

ప్రత్తిపాడులో ఈదురు గాలులతో కూడిన వర్షం

రోడ్ల వెంబడి పడిపోయిన హోర్డింగులు




రోడ్డు వెంబడి పడిపోయిన హోర్డింగ్‌లు

ప్రజాశక్తి ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలం లో బుధవారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుముల తో కూడిన వర్షం దాటికి అనేక చోట్ల చెట్లు పడిపోయాయి విపరీతంగా గాలి విచడం తో రేకుల షెడ్డులు కొన్ని చోట్ల కరెంట్ స్తం భాలు కూడా విరిగి పడిపోయాయి. కొన్ని గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. కరెంట్ అంతరాయం వలన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఒక పక్క కరెంట్ లేక ప్రజలు నానా అవస్తలు పడుతుంటే దోమలు కుట్టి మరింత ఇబ్బందులు పడుతు న్నారు. మండలంలో పడిపోయిన చెట్లు హెూర్డింగులు తెలుసుకుని ఎస్ఐ నాగేంద్ర వాహన దారులకు అంతరాయం లేకుండా చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

రాజధానికి వారిచ్చినట్లే మీరూ భూములివ్వాలి

ల్యాండ్ పూలింగ్‌పై అవగాహన సదస్సుల్లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పెదకూరపాడు

రాజధానికి భూ సమీకరణలో భాగంగా ల్యాండ్ పూలింగ్‌పై మండలంలోని బలుసుపాడు, ఖమ్మంపాడు గ్రామాల్లో అవగాహన సదస్సులను ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు, టిడిపి నాయకులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బలుసుపాడు గ్రామ రెవెన్యూలో సుమారు 2500 ఎకరాలు, ఖమ్మంపాడు గ్రామ రెవెన్యూ భూములు సుమారు 1800 ఎకరాలు ఉన్నాయి. రాజధానిలోని 29 గ్రామాల్లో రైతులకు ఏ విధంగా తమ భూములిచ్చారో అదేవిధంగా ఈ గ్రామాల్లోనూ ఇవ్వాలని అన్నారు. త్వరలో రెవెన్యూ శాఖ కూడా గ్రామసభలు నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కె.పాపారావు, రమేష్ పాల్గొన్నారు.



విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నీమెంట్ విజేతగా శ్రీ ఆంజనేయ జట్టు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జమండ్లమూడి లింగారావు 3వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకార్థం రెంటపాళ్లలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడ్రోజులపాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఉత్కంఠగా సాగిన టోర్నీలో విజేతగా శ్రీ ఆంజనేయ జట్టు నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.3 వేలను అందించారు. రెండోస్థానం సాధించిన సమ్మర్ స్టార్ జట్టుకు రూ.2 వేలు, మూడో స్థానం దక్కించుకున్న జెఎల్ఆర్ జట్టుకు రూ.వెయ్యిని నిర్వాహకులు బహూకరించారు. క్రీడల్లో పాల్గొన్న వారికి, నిర్వహణకు సహరించిన వారికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. పోటీలను డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పి.మహేష్, జె.రాజ్‌కుమార్, హరిపోతురాజు, అమూల్య, భగత్, పెద్ద తాతారావు, సుజాత పర్యవేక్షించారు. జె.బాజీ, చిన్న వీరయ్య, అనిల్, అమర్నాథ్, రవి, మహేష్, రాకేష్, విజయ్, హగ్గయ్, ఆదిత్య, లెనిన్, వెంకటేష్, అరుణాచలం, వెంకటపతి, అమృతవర్షిణి, యశ్వంత్, పండు పాల్గొన్నారు.

జెడ్‌పి ఉన్నత పాఠశాలలుగా 3 బడులు అప్‌గ్రేడ్

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని మంచికల్లు, ఆంజనేయ స్వామి మాన్యం, మల్లవరం గ్రామాలలోని ప్రాథమికోతన్నత పాఠశాలలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఇఒ-2 శివనాగేశ్వరరావు బుధవారం తెలిపారు. మొత్తం 140 మంది టీచర్లకు గాను స్కూల్ అసిస్టెంట్లు 18 మంది మిగులు ఉండగా 16 మంది ఎస్‌జిటిల కొరత ఉందన్నారు. మండలంలో 10 మోడల్ ప్రైమరీ పాఠశాలలు, 8 బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, నాలుగు ఫౌండేషన్ స్కూల్ (ఒకటి నుంచి రెండో తరగతి వరకు) ఉన్నాయన్నారు. ఇకమీదట మండలంలో జెడ్‌పి పాఠశాలల సంఖ్య ఆరుగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

కార్మిక హక్కులు, పని భద్రత కోసం మూడ్రోజుల సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న కార్మికులు నాయకులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్ల రద్దు, ఆప్కాస్ సంస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పొద్దని కోరుతూ ఈనెల 20, 21, 22 తేదీల్లో సమ్మె చేస్తున్నట్లు సిఐటియు నాయకులు, కార్మికులు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును, వివిధ సమస్యలపై వినతిపత్రాలను మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు బుధవారం అందజేశారు. సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులు బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ అమలుకు పూనుకుందని విమర్శించారు. కార్పొరేట్లు మరింత లాభాలు చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వ విధానాలున్నాయన్నారు. 17 రోజుల సమ్మె సందర్భంగా పారిశుధ్య కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కార్మికులకు నష్టం చేసే ఆప్కాస్ సంస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పుచెప్పరాదని డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, రిటైర్ అయిన, చనిపోయిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులకు పరిహారాన్ని వెంటనే అందించాలని కోరారు. ఈ అంశాలపై మూడ్రోజులపాటు జరిగే సమ్మెలో పారిశుధ్య కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.కొండలు, బి.రామారావు, ఎ.రామారావు, ఎం.ప్రతాప్, కె.శ్రీను, ఎలమంద, యు.రామారావు, కె.తిరుపతిరావు, కె.సాగర్‌బాబు పాల్గొన్నారు.



అమరావతి సమావేశంలో మాట్లాడుతున్న జి.రవిబాబు

ప్రజాశక్తి - అమరావతి

సమ్మె జయప్రదం కోసం సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక సిఐటియు కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరుగుతున్న ధరలకే అనుగుణంగా కనీస వేతనం స్కీం వర్కర్లకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాంబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టడానికి కార్మిక వర్గమంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎం.శ్రీనివాసరావు, బి.సూరిబాబు, లక్ష్మణ్, వివిధ రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు పాల్గొన్నారు.

నరసరావుపేటలో 'సింగిల్' చిత్ర బృందం సందడి



మాట్లాడుతున్న శ్రీవిష్ణు, పక్కన కేతిక శర్మ, ఇవానా

ప్రజాశక్తి-నరసరావుపేట

జీవితంలో ప్రతి ఒక్కరూ తమకు తాముగా నిర్ణయాలను తీసుకునే కోణంలో నిర్మించిన 'సింగిల్' సినిమాను రూపొందించామని సినీ నటుడు శ్రీ విష్ణు అన్నారు. గీత ఆర్ట్స్ సమర్పణలో నిర్మించిన ఈ చిత్ర ప్రదర్శన నేపథ్యంలో బృందం రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవ యాత్రను చేపట్టింది. ఇందులో భాగంగా నరసరావుపేట పట్టణం కాసు కన్వెన్షన్‌లోని గీత మల్టీప్లెక్స్‌లో శ్రీవిష్ణు, డైరెక్టర్ కార్తీక్ రాజు, కథానాయికలు కేతిక శర్మ, ఇవానా బుధవారం సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ ఈ వేసవిలో మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి మంచి సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో రూపొందించిన ఈ చిత్రం కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అన్నారు. కథానాయకునిగా తన 18వ చిత్రం మంచి అనుభూతి లభించిందని చెప్పారు. ఈ చిత్రంలో నటించడం చాలా అదష్టంగా భావిస్తున్నానని కేతిక శర్మ చెప్పారు. ఇది తన మొదటి తెలుగు సినిమా అని, ఈ సినిమాను పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు మాట్లాడుతూ సినిమా అన్ని సెంటర్లలో దిగ్విజయంగా ప్రదర్శింతమవుతోందని, ప్రేక్షకుల ఆశీర్వాదం కొనసాగాలని కోరారు.



పదో తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఐగ్రో విద్యార్థులతో స్కూల్ ఛైర్మన్ పి.వెంకట్

సిబిఎస్ఇ 'పది' ఫలితాల్లో ఐగ్రో విద్యార్థుల ప్రతిభ

- 100 శాతం ఉత్తీర్ణతపై ఛైర్మన్ పి.వెంకట్ హర్షం - విద్యార్థులకు అభినందన
- 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రకటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యా రంగంలో అత్యాధునిక నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ఒత్తిడి లేని విద్యా బోధనకు, ఉత్తమ ఫలితాల సాధనకు తమ స్కూల్ కేరాఫ్ అని ఐగ్రో ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ పి.వెంకట్ అన్నారు. ఇందుకు నిదర్శనం పదో తరగతి సిబిఎస్ఇ ఫలితాలలో తమ విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణతని చెప్పారు. ఈ మేరకు బుధవారం నరసరావుపేట సమీపంలోని చిలకలూరిపేట రోడ్డులో గల పాఠశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కెఎస్‌బిఎ సాత్విక్ 500 మార్కులకు గాను 478 మార్కులతో ప్రథమ స్థానం, శ్రీపాద శ్రీచరణ్ 459 మార్కులతో ద్వితీయ స్థానం, భవనం రాజశేఖర్‌రెడ్డి 429 మార్కులతో తృతీయ స్థానం సాధించారని వివరించారు. గతేడాది కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబోధన తమ ప్రత్యేకతని, 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. పాఠశాల వైస్ ఛైర్మన్ పల్లబోతుల మురళిబాబు అమెరికా నుండి వర్చువల్‌గా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొట్టమొదటి సిబిఎస్ఇ పాఠశాల ఐగ్రో అన్నారు. తొమ్మిదేళ్లుగా ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దామన్నారు. విద్యార్థులకు పోషకవిలువలతో కూడిన మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దివి శేషసాయి, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ యెండ్లూరి చంద్రబాబు, అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది విశ్వనాథ్, సాయిబాబా, నాగసాయి రామ్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌ఓబీకి వైసిపి హయాంలోనే రూ.52 కోట్లతో శంకుస్థాపన

- చిల్డ్రన్ పార్కు ఏర్పాటుకూ రూ.15 కోట్లు తెచ్చాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల పట్టణం, జానపాడు గ్రామానికి ఎంతో ముఖ్యమైన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2022లోనే అప్పటి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.52 కోట్లతో అనుమతిచ్చారని, టెండర్లు కూడా పూర్తి చేసి ఏజెన్సీలకు అప్పజెప్పడంతోపాటు శంకుస్థాపనా చేశామని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ వీడియోను విడుదల చేశారు. తామే చేపట్టిన బ్రిడ్జి పనులను నేడు కూటమి ప్రభుత్వం మళ్లీ శంకుస్థాపన చేయబోతోందని చెప్పారు. పనులను ఇప్పటికే ఏడాదిపాటు ఆలస్యం చేశారని, దీనిపై తాము కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యమూ వేద్దామనుకున్నామని చెప్పారు. ఇది తెలిసిన సిఎం... స్థానిక అధికారులు, నాయకులను ఆదేశించడంతో హడావుడిగా మరోసారి శంకుస్థాపన చేపట్టారని ఎద్దేవ చేశారు. ఎన్నిసార్లు శంకుస్థాపనలు చేసినా తమకు అభ్యంతరం లేదని, బ్రిడ్జిని మాత్రం పూర్తి చేయాలని కోరారు. పనులను రెండేళ్లలో పూర్తి చేయాలని, అప్పటి వరకూ తాము ఉద్యమిస్తూనే ఉంటామని అన్నారు. ఇది పూర్తయితే పిడుగురాళ్లలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుకు కూడా వైసిపి ప్రభుత్వంలోనే స్వచ్ఛభారత్ ద్వారా కేంద్రం నుండి రూ.15 కోట్లు తెచ్చామని, చెరువు స్థలం కబ్జా కాకుండా గోడనూ కట్టామని చెప్పారు. దీన్ని కూడా త్వరగా పూర్తి చేయాలన్న ఆయన అభివృద్ధికి తామెప్పుడూ తోడుగా ఉంటామని చెప్పారు.

రెంటచింతలకు పాఠ్యపుస్తకాలు

ప్రజాశక్తి - రెంటచింతల

రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించాల్సిన పాఠ్యపుస్తకాలు మండలానికి బుధవారం చేరాయి. 1-10 తరగతుల వారికి ఇచ్చేందుకు 12,600 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.







తెనాలిలో రవాణా రంగ కార్మికులతో మాట్లాడుతున్న హుస్సేన్ వలి, ఉండవల్లిలో రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎం రవి, ఫిరంగిపురంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు

కార్మికులారా సమ్మెకు సిద్ధం కండి : సిఐటియు

ఈనెల 20వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని జిల్లా వ్యాప్తంగా ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. తెనాలిలో రవాణా రంగ కార్మికులతో సిఐటియు నాయకులు సమావేశం నిర్వహించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఫిరంగిపురంలో ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, తాడేపల్లి టిటిటి యార్డ్‌లో కార్మికులు సమ్మెలో పాల్గొంటారని, ఆరోజు పనిలోకి రారని కాంట్రాక్టర్ మాధవరెడ్డికి సిఐటియు నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ కుంచనపల్లి జాతీయ రహదారి వెంబడి విస్తృత ప్రచాచరం నిర్వహించారు. ఉండవల్లిలో నిర్వహించిన సమాశంలో ఎం రవి ప్రసంగించారు . గుంటూరు అర్బన్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు టి రాధ ఆధ్వరంలో వినతి పత్రం ఇచ్చారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

దేశవ్యాప్త సమ్మెలో రవాణా రంగ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి కోరారు. సమ్మె ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి, ముద్దన సాంబశివరావులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మే 20న ఉదయం 9 గంటలకు తెనాలి మున్సిపల్ కార్యాలయం నుండి జరిగే ర్యాలీ ప్రదర్శనలో కార్మికులు పాల్గొనాలని కోరారు. తొలుత వివిఎస్ఆర్ కళాశాల ఎదురుగా గల మినీ లారి స్టాండ్, ఆర్టిసి బస్టాండ్, గంగానమ్మపేట, మున్సిపల్ కార్యాలయం, మారిసు పేట, చెంచుపేట లోగల కార్మికులను కలసి కరపత్రాలు పంపిణీ నిర్వహించి సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ కరీముల్లా, ఫేక్ మీరా ఖాన్, ఎస్ కొండలు, షేక్ సుభాని ఎస్ పిచ్చి రెడ్డి, ఫేక్ హసన్, షేక్ జిలాని, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సార్వత్రి సమ్మెలో భాగంగా ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, గుంటూరు జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం ఫిరంగిపురం సెంటర్లో ఆటో రంగంలో సమ్మె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ న్యాయ సంహిత చట్టాలు పేరుతో చిన్న కారణాలు కూడా డ్రైవర్ను బాధ్యులను చేస్తూ లక్షల్లో పెనాల్టీలు, ఏళ్ల తరబడితే జైలు శిక్షలు వంటివి రూపొందించడం అంటే డ్రైవర్ల పై కక్షకట్టడం అన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎస్ఎం వలీ యూనియన్ నాయకులు భాస్కర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి


కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 20వ తేదీ జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా తాడేపల్లి టిటిటి యార్డ్‌లోని 200 మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటారని, ఆరోజు పనిలోకి రారని కాంట్రాక్టర్ మాధవరెడ్డికి బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు వేముల దుర్గారావు మాట్లాడుతూ కార్మికులకు ఉరి తాళ్లుగా మారేటటువంటి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.బాబురావు, ముఠామేస్త్రి టి.శ్రీనివాసరావు, ఏఐటియుసి నాయకులు టి.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, జరుగు సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని, సిఐటియు తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ అన్నారు. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి జాతీయ రహదారి వెంబడి విస్తృత ప్రచారాన్ని కరపత్రాలు పంపిణీ చేస్తూ, సిఐటియు నాయకులు చేపట్టారు. ఈ మేరకు కుంచనపల్లి జాతీయ రహదారి వద్ద పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులను కలసి సార్వత్రిక సమ్మెలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు జోజి బాబు, కృష్ణ తులసి, ప్రసాద్, వెంకటేశ్వరమ్మ, చిన్నప్ప పాల్గొన్నారు.



కుంచనపల్లి హైవేపై ప్రచారం నిర్వహిస్తున్న పల్లె కృష్ణ



టిటిటి యార్డులో సమ్మెనోటీసు అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, నల్ల చట్టాలను, లేబర్ కోడులను ఉపసంహరించుకోవాలని కోరుతూ రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి, రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు కె జగదీశ్వర రెడ్డి లు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఉండవల్లి ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన రైతు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మే 20న దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టబోతున్నారని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజా వినాశకర విధానాలను విడనాడాలని, నల్ల చట్టాలను, లేబర్ కోడ్లను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టి.బక్కిరెడ్డి, ఈమని రామారావు, కే రామకృష్ణ సుందర్రావు పి గాంధీ మేరీ జయలక్ష్మి స్వర్ణకుమారి పాల్గొన్నారు.



గుంటూరులో సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు : అంగన్వాడీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి, కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీలు పాల్గొంటున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) గుంటూరు అర్బన్ ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్న వెంకాయమ్మ, టి.రాధ తెలిపారు. ఈ మేరకు బుధవారం గుంటూరు అర్బన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ విధానాలు విరమించుకోవాలని కోరారు.

ముఠా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..

దేశ వ్యాప్తంగా 20వ తేదీన చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక లాడ్జి సెంటర్‌లోని టైల్స్ అండ్ శానిటరేషన్, బస్టాండ్ వద్ద సివిల్ సప్లై దిగుమతి ముఠా కార్మికుల జనరల్ బాడీని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు నగర ముఠా వర్కర్స్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఠా కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సివిల్ సప్లైస్ గూడెం ఇంచార్జ్‌కి సమ్మె నోటీసు అందచేశారు. కార్యక్రమంలో జోజి, సారథి ,సివిల్ సప్లైస్ ముఠామేస్త్రి కోటయ్య, ఇర్మియ, అశోక్ ద్వారకారావు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

162వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు బుధవారం నాటికి 162 రోజుకు చేరు కున్నాయి. దీక్షలను సిఐటియు నాయకులు వేముల దుర్గారావు ఎసిసి యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. దీక్షలో మొలక శారద, వై.రమాదేవి, వి.లక్ష్మి, డి.రమ, ఎం.శివమ్మ కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు దుర్గారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎసిసి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరైనది కాదని చెప్పారు. వెంటనే సంబంధిత యజమానులను పిలిపించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గురవయ్య, సూర్య ప్రకాష్, నాగేశ్వరరావు, ఇస్మాయిల్, సాంబయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్యారాణి

సీబీఎస్‌ఈలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన సెయింట్ జోసెఫ్ విద్యార్థులు

ప్రజాశక్తి - పెదకాకాని

మండల కేంద్రమైన పెదకాకానిలోని సెయింట్ జోసెఫ్ హై స్కూల్ విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో అద్భుత విజయాన్ని సాధించారు. 113 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా అందరూ ఉత్తీర్ణులు అయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్యారాణి బుధవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను కష్టపడి నేర్చుకునే విధంగా కాకుండా ఇష్టపడి నేర్చుకునే విధంగా ఇక్కడి ఉపాధ్యాయులు చెప్పటం వల్లనే ఇలాంటి అద్భుతమైన ఫలితాలు వచ్చాయన్నారు. తమ పాఠశాలలో విద్యతోపాటు మానసిక ఉల్లాసం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య నభ్యసించడం వల్లనే అత్యధిక మార్కులు సాధించరన్నారు.ఎం.నవనీత్ 500లకు 468 సాకేత్ మరియు ఎస్. మనోహార్ ఇద్దరూ 467లను, ఈ విజయానికి తోడ్పడిన ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రుల సహకారాన్ని ఆమె అభినందించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

రిటైర్డ్ డీఎస్పీ బొప్పన విజయ్ కుమార్ కన్నుమూత

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

మాజీ పోలీసు ఉన్నతాధికారి బొప్పన విజయ్‌కుమార్ మరణరం తీరని లోటని పోలీసు, వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఆయన మృతదేహాని వారు బుధవారం సందర్శించి నివాళులర్పించారు. మంగళగిరి పట్టణంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గతంలో ఆయన విధులు నిర్వహించారు. భార్య 2022లో అనారోగ్యంతో మరణించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నిజాయితీగా నిబద్ధత కలిగిన విజయ్ కుమార్ చిన్నతనం నుండి కమ్యూనిస్టు భావజాలంతో, అభ్యుదయ వాదిగా ఉండేవారు. అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక అధ్యక్షుడిగా పనిచేసిన విజయ్ కుమార్ మరణ వార్త తెలుసుకున్న పలువురు నాయకులు, అధికారులు మంగళగిరి పట్టణ పరిధిలోని, ఇప్పటం రోడ్డు ఎదురుగా ఉన్న వరుణ్ అపార్ట్మెంట్ లో ఆయన నివాసానికి విచ్చేసి, ఆయన భౌతిక కాయానికి పూలమాలల వేసి, నివాళులు అర్పించి, విజయ్ కుమార్ తో తమకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. నివాళులు అర్పించిన వారిలో సిపిఎం నాయకులు జేవి రాఘవులు, పి నరసింహారావు, మంగళగిరి మండల మాజీ ఉపాధ్యక్షులు మొసలి ఫకీరయ్య, ఎస్ ఎస్.చంగయ్య, పిల్లలమర్రి బాలకృష్ణ, జొన్న శివశంకరరావు, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, దొంతి రెడ్డి వెంకటరెడ్డి, అమరావతి సాంస్కృతిక చైతన్య వేదిక కార్యదర్శి పి.వి.రమణ, అమరావతి రాజధాని నాయకులు పి.సుధాకర్ రావు, పి.వి.మల్లికార్జునరావు, ఆకుల ఉమామహేశ్వరరావు, దండమూడి ప్రియాంక, విజయ్ కుమార్ కుమార్తెలు సునీల్ శ్రీనివాసుని, నీలిమ దుర్గ, కుటుంబ సభ్యులు ప్రసాద్ చౌదరి, బి.విజయ్ కుమార్ ఘోష్ తదితరులు పాల్గొన్నారు.



బొప్పన విజయ్‌కుమార్(ఫైల్)

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మేడికొండూరు



సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మణరావు కోరారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో ధనలక్ష్మి అధ్యక్షతన బుధవారం మేడికొండూరులో సమావేశాం జరిగినది. బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలు వ్యతిరేక విధానాలకు పంచాయతీ వర్కర్స్ ఆశాలు, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే ధనుంజయ్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ధనుంజయ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో రెవెన్యూ సమస్యలు సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే దనుంజయ్ అన్నారు. బుధవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో పల్నాడు జిల్లా గురజాల రెవిన్యూ డివిజన్ అధికారులతో జాయింట్ కలెక్టర్ సూరజ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రీ-సర్వే, సివిల్ సప్లయిస్, రెవెన్యూ అంశాలకు సంబంధించి సమీక్షలో అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి ఎక్కడా రాజీ లేకుండా సమస్యలను జిల్లా అధికారులకు తెలియజేసి పరిష్కరించాలని సూచించారు. సమస్య వచ్చినప్పుడు స్థానిక ఆర్డీఓకి గాని తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సమస్యను పరిష్కరి సమావేశంలో గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ, ఏడి సర్వే డిపార్ట్ మెంట్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి, గురజాల రెవెన్యూ డివిజన్ తహశీల్దార్లు, ఎంఎస్ఎస్‌లు డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

లోవోల్టేజి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని హనుమాన్ నగర్ ప్రజలు కొన్ని నెలలుగా నువ్వు వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ పట్టణ కార్యదర్శి ఉలవల పూడి రాము అన్నారు. రాము మాట్లాడుతూ ఒకటి, రెండు, మూడు, నాలుగు లైన్లకు సంబంధించి అచ్చట నివసించుచున్న ప్రజలకు కరెంటు సప్లై తక్కువగా వస్తున్న కారణంగా టీవీలు ఏసీలు, ఫ్రిజ్లు ఒక్కసారిగా షార్టేజ్ లకు గురై చెడిపోతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. సాయం త్రం 8 నుండి లోఓల్టేజీతో ఫ్యానులు కూడా సరిగా తిరగక, ఇళ్లలో ఊపిరాడక పసిపిల్లలు, వృద్ధులు, ఇళ్లలో మహిళలు అల్లా డి పోతున్నారు. లోవోల్టేజ్ పుణ్యమా అని ఏసీలు పని చేయక, దోమలు కుట్టి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హనుమాన్‌నగర్ ప్రజల సమస్యని పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. సమస్య పరిష్కారం చేయని పక్షంలో కరెంట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎ.మారుతీ వరప్రసాద్, పవన్‌కుమార్, బూదాల నాగయ్య, షేక్ మస్తాన్వలి, షేక్ నాగూర్, ఎం.సుబ్బారావు, పి బ్రహ్మం, హనుమాన్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణం

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల పట్టణంలోని పూర్ణయ్య షెడ్డు బజారులో శ్రీమద్విరాట్ శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవింద మాంబల కళ్యాణాన్ని పురస్కరించుకొని దేవాలయ అర్చకులు శేషబ్రహ్మచార్యులు, కూరెళ్ళ వీరబ్రహ్మచార్యులు పలు పూజా కార్యక్రమాలతో పాటు, పలు రకాల అషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పలురకాల పుష్పాలతో అలం కరించారు. అట్లూరి శివారెడ్డి పద్మావతి పుణ్యదంపతుల చేత వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబ కళ్యాణం వేదమంత్రాల నడుమ భాజాభజంత్రీల భక్తుల గోవిందనామాల నడుమ కన్నుల పండుగగా స్వామివారి కళ్యాణం నిర్వహిం చారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించడానికి మాచర్ల పట్టణం లోని పలు వార్డుల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, మహా అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ మూలవిరాట్ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీసభ్యులు పాల్గొన్నారు.

విద్యావేత్త, ఉపాధ్యాయులు మైఖేల్ బాబు ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - వినుకొండ



మైఖేల్ బాబు (ఫైల్‌ఫొటో)

పట్టణ ప్రముఖ విద్యావేత్త ఉపాధ్యాయుడు మీ మైఖేల్ బాబు మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా మృతి చెందారు. కొన్నేళ్లుగా హృదయ సంబంధ సమస్యతో బాధపడుతున్న మైఖేల్‌బాబు మంగళవారం మధ్యాహ్నం స్థానిక రైలు పేటలోని తన ఇంటి వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్‌కు ద్విచక్ర వాహనంపై వెళుతూ వేసవి తీవ్రతను తాళలేక కింద పడిపోయారు. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నరసరావు పేటకు తరలించే ప్రయత్నం చేస్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మహాత్మాగాంధీ స్కూల్ పేరుతో విద్యా సంస్థల స్థాపించి రెండున్నర దశాబ్దాలుగా విద్యారంగా సేవలో వందలాది మందికి మెరుగైన విద్యను అందించారు. మైఖేల్‌బాబు మృతి వార్త తెలుసుకున్న స్థానిక ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని సందర్శించిన వారిలో నారాయణ మాస్టారు, వైల్ కిషోర్, డాక్టర్ ఇన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, లగడపాటి శ్రీనివాసరావు, ఎస్.ఎం.సుభాని, స్వరూప్ శ్రీనివాసరావు, పి.గోస్‌ఖాన్, పి. ప్రభాకర్ రావు, షేక్‌నబీ, కె.వెంకటేశ్వరరావు, మాలమహానాడు ప్రతినిధులు కీర్తిపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్



సభలో మాట్లాడుతున్న అంజనీకుమారి

విద్యలో మెరుగైన ఫలితాలు సాధిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించటం సాధ్యం అవుతుందని తెలంగాణ సిఎస్సీ కోర్ట్ సీనియర్ సూపెర్నిడెంట్ పీవీపి అంజనీ కుమారి అన్నారు . బుధవారం ఆమె స్థానిక మస్తాన్ ఐ టి ఐలో హెల్ప్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ మేళాలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సభకు హెల్ప్ పౌండేషన్ అధ్యక్షులు కంచెర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యలో మెరుగైన ఫలితాలు సాధించాలి అన్నారు. ఈ దేశ సంపద విద్యార్థులదే అనే విషయాన్ని గుర్తించాలి అన్నారు. ముందుగా లక్ష్యాలను ఎంచుకోవాలని వాటిని సాధించటానికి కృషి, పట్టుదల కావాలి అన్నారు. ఇటువంటి జాబ్ మేళాలను విద్యార్థులు ఉపయోగించుకొని ఉద్యోగ అవకాశలను అందిపుచ్చు కోవాలి అన్నారు. ఇటువంటి జాబ్ మేళాలను ఏర్పాటు చేసిన హెల్ప్ పౌండేషన్ నిర్వాహకులను ఆమె అభినందించారు. ముందుగా ఆపరేషన్ సింధూర్‌లో అసువుల బాసిన వీర జావాన్లకు నివాళులు అర్పించారు. వివిధ రకాలుకు చెందిన 17 కంపెనీలు ప్రతినిధులు ఇంటర్వ్యూలా నిర్వహించగా 180 విద్యార్థులు హాజరైనారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ ట్రయి నింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణరెడ్డి, బాలఆదిత్య డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకటేష్, గుంటూరు జిల్లా హెల్ప్ పౌండేషన్ అధ్యక్షులు సునీత, పల్నాడు జిల్లా అధ్యక్షులు సౌజన్య, మస్తాన్ ఐటిఐ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

రూ.5 కోట్ల పలు అభివృద్ధి పనులు పూర్తి

మున్సిపల్ చైర్మన్ మదార్ సాహెబ్



మదార్‌సాహెబ్‌ను సన్మానించిన డప్పు కళాకారులు

ప్రజాశక్తి - మాచర్ల

రూ.5 కోట్లకు పైగా నిధులతో పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పూర్తి చేశామని, మాచర్ల మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి, తన దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ ఛాంబర్‌లో 20వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు, డప్పు కళాకారులు నూతనంగా ఎన్నికైన చైర్మన్ మదార్‌ను కలిసి సన్మానించారు. వార్డులోని సమస్యలను విన్నవించారు. స్పందించిన చైర్మన్, వార్డుల్లోని ప్రతి సమస్యను పరిష్క రించేందుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సుముఖంగా ఉన్నారని, రూ.11కోట్ల నిధులతో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను ఇప్పటికే గుర్తించామని తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన వారిలో 20 వార్డు టీడీపీ నాయ కులు మాచర్ల వాసు, ప్రకాశ్, దేవానంద్, డప్పు కళాకారులు జెట్టిపాలెం వెంకటేశ్, జాంబవ రాజు, మంగాబాయ్ ఉన్నారు.

లక్షల్లో మొక్కలు నాటేందుకు రంగం సిద్ధం

మొక్కల ఉచిత పంపిణీకై అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఒప్పంద పత్రాన్ని మార్చుకుంటున్న డాక్టర్ జాస్తి రంగారావు,ఎంఎస్ఎస్ మూర్తి

రైతుల ఆర్థిక అభివృద్ధి, ఉద్యానవన అభివృద్ధి పర్యా వరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకొని, స్థానిక అసిస్ట్ వ్యవసాయ ఆధారిత టెక్నాలజీ సంస్థ వరాహ మధ్య అవ గాహనా ఒప్పందం బుధవారం అడ్డరోడ్ వద్ద గల అసిస్టు కార్యాలయంలో కుదిరింది. ఈ ఒప్పందాన్ని అసిస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ జాస్తి రంగారావు వరాహ భాగస్వామ్యాల మేనేజరు ఎంఎస్ఎస్. మూర్తి పరస్పరంగా మార్చుకున్నారు. ఈ ఒప్పందం సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జాస్తి రంగారావు మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం వచ్చే సీజన్‌లో రూ. 5కోట్ల 24 లక్షల విలువ కలిగిన 4,50 వేల మామిడి, జీడి, కొబ్బరి, నిమ్మ, ఎర్ర చందనం, టేకు మొక్కలను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది జిల్లాల్లోని రైతులకు ఉచితంగా పంచనున్నామన్నారు. అసిస్ట్ స్థాపన నుండే గ్రామీణాభి వృద్ధి లక్ష్యంగా పని చేస్తోందన్నారు. వరాహ సంస్థతో భాగ స్వామ్యంగా, పండ్ల తోటలు వన జాతుల మొక్కల ఉచిత పంపిణీ ద్వారా గ్రామీణ రైతులను స్థిరమైన ఆదాయ మార్గాల వైపు నడిపించ గలమనే విశ్వాసం మాకు ఉందన్నారు. ఎంఎస్ఎస్. మూర్తి వరాహ పంటల శాస్త్రీయ విశ్లేషణ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుం దన్నారు. అసిస్ట్‌తో కలిసి పని చేయడం వలన మాలక్ష్యం గ్రామీణ స్థాయిలో విజయ వంతంగా అమలు అవుతోందన్నారు. కార్యక్రమంలో రెండు సంస్థల ప్రముఖులు పాల్గొన్నారు.



కూలింగ్ వాటర్ పంపిణీ చేస్తున్న మెట్టు గోవిందరెడ్డి

మండుటెండలో ఉచిత కూలింగ్ వాటర్ పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మండుటెండలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు శ్రీరామక్రిష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ కూలింగ్ మినరల్ వాటర్ పంపిణీని కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా వివిధ పనులు నిమిత్తము పలు గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు తాగునీరు అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్న విషయం పట్టణ ప్రజలకు విదితమే. స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, మహాలక్ష్మి డైరీ అధినేత నర్రా వెంకట నరసయ్య సౌజన్యంతో మొబైల్ ఉచిత కూలింగ్ మినరల్ వాటర్‌ను మాచర్ల టౌన్‌లో ప్రతి సెంటర్‌లో తిరుగుతూ ఒక్కొక్క సెంటర్లో కొంత సమయం కేటాయిస్తూ ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి తాటిముంజులు, పండ్లు, చిరువ్యాపారాలు చేసేందుకు వచ్చే వారు మాచర్ల వచ్చి ఎండలో కూర్చొని అమ్మ కాలు సాగిస్తారు. సమయానికి ఆహారం లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన మెట్టు గోవిందరెడ్డి వారికి కూడా రోజు మధ్యాహ్నం అన్నదానం చేస్తున్నారు. ఆ చిరువ్యాపారులు మంచిగా భోజనం చేసి, ఉచిత కూలింగ్ మినరల్‌వాటర్ తాగి ఆనందంతో తనను అభినందిస్తున్నట్లు గోవింద రెడ్డి వివరించారు.

వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా రోడ్ల మీద ప్రయాణం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వినుకొండ దగ్గర్లో జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా నలుగురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాదాసు భానుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రమాదం జరిగినప్పుడు వాటి గురించి మాట్లాడుకోవడం మినహా ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఇవన్నీ నివారించ తగిన ప్రమాదాలని భానుప్రసాద్ అన్నారు. అధికారులు అలసత్వం వీడి పటిష్టమైన చర్యలు చేపట్టడంలో విఫలమవుతున్నారన్నారు. చిలకలూరిపేట పట్టణంలో వాహనాలకు నెంబర్ ప్లేట్లు లేకుండా యధేచ్ఛగా తిరగబడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నప్పటికీ వారిని పట్టించుకునే నాథుడే లేరని తెలిపారు. వాహనాలకు నెంబర్ ప్లేట్లు వాడకుండా నేరాలకు పాల్పడిన, యాక్సిడెంట్స్ చేసి ఆపకుండా వెళితే ఎలా పట్టుకోగలుగుతారన్నారని ప్రశ్నించారు. జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మోహన్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలం లోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని మగం హోటల్ వద్ద గురువారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై మోహన్ తెలిపిన వివరాల ప్రకారం రొంపిచర్ల మండలం ఎడ్వర్ట్ పేట గ్రామానికి చెందిన పేరా వెంకటేశ్వర రెడ్డి(62) అను వ్యక్తి దాచేపల్లి మండలం పెద్ద గార్లపాడు గ్రామంలో ఉన్న మనవడిని ఎడ్వర్ట్ పేట తీసుకెళ్లేందుకు స్కూటీపై వెళ్తుండగా బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని మురుగన్ హోటల్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న సరిహద్దురాయికి ఎత్తుకోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడని పిల్లవానికి తల వద్ద చిన్నపాటి గాయమైందని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలం వద్దకు వచ్చి జరిగిన ప్రమాదం తీరును పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలియజేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తెనాలి ఆర్టీసీ డిపోలో తాగునీటి ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు

- రూ.70 లక్షల నిధులతో అభివృద్ధి
- మంత్రి మనోహర్ సహకారంతో 20 బస్సులు ఏర్పాటు
- మరో పది నూతన బస్సులు ఏర్పాటుకు ప్రతిపాదనలు


వివరాలు వెల్లడిస్తున్న డిపో మేనేజరు రాజశేఖర్

ప్రజాశక్తి-తెనాలి

ప్రయాణికుల మెరుగైన వసతుల కల్పనకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ తెలిపారు. ప్రయాణికుల సమస్యలను డయల్ యువర్ డిఎం ద్వారా తెలియపరచవచ్చని ప్రయాణికులకు సూచించారు. బుధవారం ఆర్టీసీ బస్టాండ్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆశయాలకు అనుగుణంగా తెనాలి బస్టాండ్‌ను మోడల్ బస్టాండ్‌గా తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రయాణికులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను డిపోలో ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు ఆర్వో ప్లాంట్ సౌలభ్యంతో చల్లని తాగునీరు సదుపాయాన్ని కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వంలో తెనాలి ఆర్టిసి డిపోలో 20 కొత్త బస్సులను రోడ్డెక్కించామని, అందులో తెనాలి-విజయవాడ నాన్ స్టాప్ బస్సులు ఉన్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరో 10 నూతన బస్సులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపమన్నారు. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా ఆర్టీసీ ఆవరణ క్లీన్‌గా ఉంచడం, మరుగుదొడ్ల నిర్వహణపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. నిలిచిపోయిన వర్షపు నీరు, మురుగు నీటిని ఎప్పటికప్పుడు మోర్టార్ల సహాయంతో తొలగించేలా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎల్ఈడి లైట్లు, అధునాతన కుర్చీలు, ఫ్యాన్లను సైతం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో బస్ బేలకు సంబంధించి సిసి రోడ్లు ఏర్పాట్లు, నీటి నిల్వలకు ఆస్కారం లేకుండా బస్ స్టాండ్ ఆవరణలో రోడ్లను ఎత్తు పెంచినట్లు తెలిపారు. కాలపరిమితి చెల్లిన బస్సులను డిపోకి పతిమితం చేసినట్లు చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూ తెనాలి ఆర్టీసీని జోన్‌లోనే ఆదర్శవంతమైన డిపోగా తీర్చిదిద్దడమే తెనాలి ఆర్టీసీ లక్ష్యమన్నారు. ఏపిఎస్ ఆర్టీసీ అభివృద్ధికి డయల్ యువర్ డిఎం ద్వారా మరిన్ని సూచనలు, సలహాలు తెలపవచ్చని ప్రయాణికులను కోరారు. కార్యక్రమంలో మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.అభిరామ్, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఐ.జె.ప్రసాదరావు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న రవిశంకర్, సాయి లలిత తదితరులు

షటిల్ బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - తెనాలి

చెంచుపేటలోని ఎన్టీఆర్ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులకు పట్టణ స్థాయిలో బుధవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో బాలబాలికలకు నిర్వహించిన పోటీలలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు కోచ్ ఎస్.వినయ్ కుమార్ తెలిపారు. పోటీలలో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా దర్శిక్ అండ్ భార్గవ్, రన్నర్స్‌గా సందీప్ అండ్ ప్రణీత్ నిలిచారు. అలాగే జూనియర్స్ బాలుర విభాగంలో జిషన్ బేగ్ అండ్ అభిషేక్ విన్నెర్స్‌గా, వంశీధర్ అండ్ కార్తీక్ రనర్స్‌గా నిలిచారు. సీనియర్స్ బాలుర విభాగంలో విన్నర్స్‌గా జ్యోతిష్ అండ్ విజయ్ కళ్యాణ్, రన్నర్స్‌గా సత్య అండ్ లాస్విత్ గెలుపొందారు. జూనియర్స్ బాలికల విభాగంలో విన్నర్స్‌గా నిత్య అండ్ తేజస్విని, రన్నర్స్‌గా భావన అండ్ రోష్మిత,సీనియర్స్ విభాగంలో విన్నర్స్‌గా దుహిత్ అండ్ ఉష్శ్రీ, రన్నర్స్‌గా టిమ్ని అండ్ సాత్విక గెలుపొందారు. విజేతలకు బహుమతి ప్రధానంలో ఎం.రవిశంకర్, సాయి లలిత, హ్యాండ్ బాల్ కోచ్ నాగరాజు, బోస్, సాయి కృష్ణ, రాము, సాయి చరణ్, శ్రీమన్నారాయణ, విజ్ఞాన్, అనురూప్ నోయల్ పాల్గొన్నారు.


వార్షిక సంచికను విడుదల చేస్తున్న నాయకులు

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని కమ్మజనసేవా సమితి వసతి గృహంలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు ఈనెల 15 నుంచి స్వీకరిస్తున్నట్లు సమితి అధ్యక్షులు సామినేని కోటేశ్వరరావు, కార్యదర్శి చుక్కపల్లి రమేష్ తెలిపారు. సమితి కార్యాలయంలో బుధవారం జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటర్, బిటెక్, ఇతర డిగ్రీలు, పిజి కోర్సులు చదివే గ్రామీణ ప్రాంతాల విద్యార్థినీలకు ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తామన్నారు. ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. భోజనం, ఇతర ఖర్చుల కోసం వసూలు చేస్తున్న ఫీజుల్లో ఈ ఏడాది రూ.వెయ్యి తగ్గిస్తున్నట్లు తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా 40 మందికి ఒక్కొక్క విద్యార్థినికి రూ.10 వేలు పారితోషికం ఇస్తామన్నారు. ప్రతి ఏటా 10వ తరగతిలో ప్రతిభ కనబర్చిన వారికి కులమతాలకు అతీతంగా 300 మందికి ఒక్కొక్కరికి రూ.7 వేలు చొప్పున స్కాలర్ షిప్పులు ఇస్తున్నామని తెలిపారు.

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని కొనసాగిన ధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి బి.నాగేశ్వరరావు సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ మూడోరోజు బుధవారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యాజమాన్యం కక్షతో అక్రమంగా సస్పెన్షన్ చేయటాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ నాగేశ్వరావుని సస్పెండ్ చేయటాన్ని నిరసిస్తూ ఎర్ర బ్యాడ్జీలు పెట్టుకొని విధులు నిర్వహించామన్నారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో గేట్ మీటింగ్ జరపాలని వారు డిమాండ్ చేశారు. యాజమాన్యం చొరవచూపి సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమాన్ని ఉధృతంగా నిర్వహించి మంగళగిరి డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేసేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామని వారు తెలిపారు. సస్పెన్షన్ రద్దు పరిచి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల డిపో స్థాయిలో జరగబోయే ఉద్యమాలకు పూర్తి బాధ్యత యాజమాన్యమే వహించాల్సి ఉంటుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్వామి, గుంటూరు డిపో 1 సెక్రటరీ రత్నాకర్, మంగళగిరి డిపో అధ్యక్షులు బిజసాంబశివరావు, గౌరవ అధ్యక్షులు చిన్ని సత్యనారాయణ, వీరయ్య, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



డిపో ఆవరణలో ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పేదలకు ఉచిత వైద్య సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తెనాలి

పేద ప్రజలకు వైద్య సేవలు చేరువ చేయడం అభినందనీయమని ఫాదర్ మిల్కియర్ రాజ్ అన్నారు. రూరల్ గ్రామం కొలకలూరు జూబ్లీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో బుధవారం 'ఆశ్రయం', హ్యాండ్ ఆఫ్ హోప్', ఫ్రెండ్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రెవరెండ్ ఫాదర్ మిల్కియర్ రాజ్ ప్రారంభించారు. శిబిరంలో షుగర్, బీపీ, మోకాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు, ఆయాసం, కంటి, దంత సంబంధిత రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఇసిజి, ఎక్స్‌రే, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో హైదరాబాదు నుంచి వచ్చిన వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ మనోజ్ఞ, డాక్టర్ స్వాతి, డాక్టర్ సనదుర్గ, డాక్టర్ సంపత్ వైద్య సేవలు అదించారు.. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌండర్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థతో కలిసి వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. టీం లీడర్ జయరాజ్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి విద్య, వైద్యం అవసరమని, వాటిని స్వచ్ఛందంగా అందించేందుకు సంస్థ తరపున పనిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ మేనేజర్ అఖిల్ సాయి, ప్రముఖ న్యాయవాది ఎస్.మురళీధర్, స్వామి, కుసుమ, శామ్యూల్, సోలోమాన్, రవి, శ్యామ్ పాల్గొన్నారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఫాదర్ మిల్కియర్ రాజ్

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి- తాడేపల్లి

పేద మధ్యతరగతి విద్యార్థులకు పెనుభారంగా ఉన్న ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యాలయంలో కమిషనర్ కృతికా శుక్లాను బుధవారం కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నారాయణ, శ్రీ చైతన్య, ఎస్సార్, ఆక్స్‌ఫర్డ్ కళాశాలలో విచ్చలవిడిగా ధనమే ధ్యేయంగా ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ ఒక జిల్లాలో ఉంటే రాష్ట్రవ్యాప్తంగా పిఆర్ఓల చేత అడ్మిషన్లు చేస్తూ మోసానికి తెర లేపారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహర్షి, సహాయ కార్యదర్శులు ఐ.రాజేష్, వీరేంద్ర ప్రసాద్, సభ్యులు ధీరజ్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

అమృత సరోవర్ పథకం కింద చెరువును అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - చేబ్రోలు

అమృత సరోవర్ పథకం కింద కొండబట్ల చెరువును అభివృద్ధి చేస్తామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ .ఉమాదేవి అన్నారు. బుధవారం శలపాడు గ్రామములో కొండబట్ల చెరువును ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులు ఇచ్చిన అర్జీ మేరకు చెరువును అర్జీదారుల సమక్షంలో పరిశీలించామన్నారు. చెరువు చుట్టూ కట్టను బలోపేతం చేసి చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మరియు మొక్కలు నాటి అభివృద్ధి చేయటంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలత సరోవర్ పథకం కింద, మరియు పంచాయతీ నిధుల నుండి కూడా అవకాశం ఉన్న మేరకు చెరువును అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీలత, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ రసూల్, స్వప్న, మండల కోఆర్డినేటర్ స్వచ్ఛభారత్ మిషన్ ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న శ్రీశ్రీ అభిమానులు

మంగళగిరిలో శ్రీశ్రీ అభిమానుల సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలో కొడాలి ఫ్యాషన్స్ షాపులో బుధవారం మహాకవి శ్రీశ్రీ అభిమానుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొడాలి రవిబాబు అధ్యక్ష వహించారు. ఈ సందర్భంగా కొడాలి రవిబాబు మాట్లాడుతూ శ్రీ శ్రీ దేశభక్తి, అభ్యుదయ, యువళ గీతాలు సమాజాభివృద్ధి గేయాలను రచించి పామరులందరి మనల్ని పొందిన మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. జన విజ్ఞానం రాష్ట్ర అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల అధ్యక్షులుగా శ్రీశ్రీ పని చేశారన్నారు. అదేవిధంగా శ్రీ శ్రీ రాసిన మహాప్రస్థానం ఖడ్గసృష్టి, మరో ప్రస్థానం వంటి ప్రసిద్ధ అభ్యుదయ గ్రంథాలను ఆయన రచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.రాజ్యలక్ష్మి, కొడాలి సాగరిక, జంజనం శిరీష, జంజనం లక్ష్మి, సిద్ధు, కె.వి.నారాయణ పాల్గొన్నారు.

నేడు వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ

ప్రజాశక్తి - తాడేపల్లి

గత నెల 28వ తేదీ నుండి ఈనెల 14వ తేదీ వరకు తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని అమరావతి ఐకాన్‌లో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం మరియు అమరావతి ఐకాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన బాలల వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభ గురువారం సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు బాలోత్సవం కోశాధికారి గాదే సుబ్బారెడ్డి, అమరావతి ఐకాన్ అధ్యక్షులు ఎం వినోద్ కుమార్ తెలిపారు. రోటరీ క్లబ్ తాడేపల్లి ప్రముఖులతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. క్లబ్స్ కింద ఓపెన్ ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న వివిధ రకాల నృత్యాలను పిల్లలు ప్రదర్శిస్తారు.

విజ్ఞాన్ విద్యార్థినికి పిహెచ్‌డి

ప్రజాశక్తి-గుంటూరు

విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన విద్యార్థి లక్ష్మి ప్రసన్నలతకు విజ్ఞాన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సీతారామాంజనేయరెడ్డి పర్యవేక్షణలో 'క్లాసిఫికేషన్ అండ్ లోకలైజేషన్ ఆఫ్ ఇంట్రక్రెనాయిల్ హెమోరేజస్ త్రూ డీప్ లెర్నింగ్ బేస్డ్ ఆప్టిమైజేషన్ ఆల్గారిథమ్స్' అనే అంశంపై పరిశోధన చేశారు. పిహెచ్‌డికి సహకరించన తల్లిదండ్రులకు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.



పిహెచ్‌డి పట్టా అందుకుంటున్న లక్ష్మీ ప్రసన్నలత



కెన్యా ప్రతినిధులతో డాక్టర్ లావు రత్తయ్య, తదితరులు

విజ్ఞాన్ యూనివర్సిటీని సందర్శించిన కెన్యా ప్రతినిధులు

ప్రజాశక్తి-గుంటూరు

భారత్-కెన్యా దేశాల మధ్య అకడమిక్, పరిశోధనలు, అగ్రికల్చర్, ఫుడ్‌టెక్నాలజీ, ఫార్మసీ, బయోమెడికల్, స్కిల్ డెవలప్‌మెంట్, డ్రోన్ టెక్నాలజీతోపాటు పరస్పర అవగాహన, దౌత్య సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయని కెన్యాలోని విహిగ కౌంటీ గవర్నర్ హెచ్‌ఈ డాక్టర్ విల్బర్ కె. ఓచ్చిలో అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఆఫీస్ ఆఫ్ డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కెన్యా దేశానికి చెందిన 8మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విల్బర్ కే.ఓచ్చిలో మాట్లాడుతూ తమ దేశంలో విద్యా అవకాశాలను మెరుగుపరచడం, సాంస్కృతిక మార్పిడిని సులభం చేయడం, కెన్యా విద్యావ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అంతేకాకుండా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో గణనీయమైన మైలురాయిని చేరుకోవచ్చన్నారు. అంతేకాకుండా కెన్యాలో వ్యవసాయం, ఆహార సాంకేతికత, స్మార్ట్ అగ్రికల్చర్, బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ, ఇంజినీరింగ్, డ్రోన్ టెక్నాలజీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో పురోగతికి విజ్ఞాన్ యూనివర్సిటీ సహకారం కావాలని కోరారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ కెన్యా ప్రభుత్వ అభ్యర్థనను యూనివర్శిటీ అధిక ప్రాధాన్యతగా పరిగణిస్తోందని, త్వరలోనే విద్య, పరిశోధన, శిక్షణల పరంగా ద్వైపాక్షిక ఒప్పందాలు జరిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.



మద్దతుగా మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ

సిహెచ్‌ఓల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సిహెచ్‌ఓల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, వారితో చర్చలు జరపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సిహెచ్‌ఒల నిరవధిక సమ్మెలో భాగంగా గుంటూరు కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న సమ్మె శిబిరంలో బుధవారం లక్ష్మీనారాయణ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఎండలో సమస్యల పరిష్కారం కోసం సిహెచ్‌ఒలు సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. గత రెండు సంవత్సరాలుగా సమస్యలు పరిష్కారం కాకపోవటం వల్లనే సమ్మెబాట పట్టారన్నారు. ముఖ్యంగా 23శాతం వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ వంటి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. సిహెచ్‌ఒల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు జి.వనజ మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్‌లో 6 సంవత్సరాలనుండి గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందిస్తున్నామని, గత రెండేళ్ల నుండి సమస్యలు పరిష్కారం కాక పేరుకుపోయాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని, ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అబ్దుస్, షరీఫ్. రవితేజ. జయంతి, డి. ప్రవళిక. హర్ష తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు పర్యాటకంపై దృష్టి సారించండి

జిల్లా 15 శాతం వృద్ధి రేటు సాధించాలి - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందాలి

20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో 15 శాతం వృద్ధి రేటుతో అభివృద్ధి పరుగులు తీసేలా అధికారులు పని చేయాలని రాష్ట్ర 20 సూత్రాల పథకం చైర్ పర్సన్ లంకా దినకర్ బాబు ఆదేశించారు. పర్యాటక రంగంలో అభివృద్ధికి జిల్లాలో చక్కని అవకాశాలున్నాయన్నారు. ఒకవైపు బౌద్ధ ఆరామాలు, విహారాలు, మరోవైపు శైవ దేవాలయాలు, పర్యాటకంగా నాగార్జున సాగర్, కొండవీటి కోట వంటి ఆహ్లాదకర, వినోదాత్మక పర్యాటక రంగానికి అవకాశాలను ఒడిసి పట్టుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెంపొందించే విధంగా, వీలైనన్ని ఎక్కువ ప్రభుత్వ నిధులు పొందేలా డీపీఆర్ లు సిద్ధం చేయాలన్నారు. బుధవారం కలెక్టరేట్ లో 20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్ బాబు జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, పశుసంవర్ధక, డ్వామా, డిఆర్ డిఎ, ఆర్డబ్ల్యూఎస్, పిఆర్, గృహ నిర్మాణ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, విద్యుత్, పబ్లిక్ హెల్త్, మెప్మా, పర్యాటక శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు అభివద్ధి వైపు జిల్లా అడుగులు వేయాలంటే క్షేత్ర స్థాయిలో అధికారులు కృషి చాలా ముఖ్యమన్నారు. నీతి ఆయోగ్ సూచనలను పరిగణనలోకి తీసుకుని వాటికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రకృతి విస్తీర్ణం పెరగాలని, ప్రస్తుతం జిల్లాలో 50వేల ఎకరాల్లో సాగవుతుందని, 1.25లక్షలకు విస్తీర్ణం పెంచాలని ఆదేశించారు. రసాయనాల అవసరం లేకుండా చేసే ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ సమతుల్యత, భూసారం కాపాడొచ్చన్నారు. పిఎం బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఒంగోలు గిత్త ఎద్దుల జాతి వృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలో ప్రజల అవసరాలకు తగినట్టుగా పాల ఉత్పత్తి పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గతేడాది 85 లక్షల పనిదినాలతో రూ 70 కోట్లు వినియోగించాలని లక్ష్యం కాగా, రూ 109 కోట్లు ఖర్చు చేయడంపై ఆరా తీశారు. మరోవైపు మెటీరియల్ కాంపోనెంట్ పనులలో లక్ష్యాలను చేరుకోలేక పోవడంతో జిల్లాకు రావాల్సిన నిధులు కోల్పోయామన్నారు. పనుల జాప్యంతో నిధులు పెండింగ్ లో ఉన్న విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లలో ఉపాధి పనుల్లో వ్యయంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి నీళ్లు రాని కుళాయిల ఏర్పాటుపై అసహనం వ్యక్తం చేశారు. పేదలకు మంజూరు చేసిన గృహాలలో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారన్నారు. పనులలో పురోగతి సాధించలేని గుత్తేదారులను తొలగించి కొత్తవారికి కేటాయించాలన్నారు. గ్రామాలలో సిసి రోడ్లు నిర్మించి కానీ సైడ్ కాల్వలు విస్మరించడంపై నిలదీశారు. ప్రజలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలని పిఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించు కునేలా వారిలో చైతన్యం కలిగించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ, బీసీలకు రూ.98 వేల వరకూ, ఇతరులకు రూ.78 వేల వరకూ సబ్సిడీతో ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ అందించే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు లాక్‌పతి దీది, 18 రకాల చేతి వృత్తుల వారికి శిక్షణ, వడ్డీలేని రుణాలు వంటి పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని, ఈ ఏడాది 28కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. పేదరిక నిర్మూలన, యువతకు ఉపాధి కల్పన, తాగునీరు అందించడమే లక్ష్యంతో అధికారులు పని చేయాలని మార్గనిర్దేశం చేశారు. 20 సూత్రాలను అధికారులు పరిగణనలోకి తీసుకుని చక్కగా అమలు చేయాలన్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర శిల్పారామం సొసైటీ చైర్ పర్సన్ మంజుల రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగారావు, డిఆర్ఓ మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంకా దినకర్ బాబు

పోస్టల్ కాలనీలో వేసవి వినోద కార్యక్రమం

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పోస్టల్ కాలనీలో బుధవారం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి వల్లభాపురపు ప్రసాద్ ఆధ్వర్యంలో వేసవి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు రంగురంగుల కాగితాలతో పువ్వులు, పక్షులు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చారు. అలాగే మ్యాజిక్ చేసి చూపించారు. మ్యాజిక్ వెనుక మాయలు, మంత్రాలు ఏవీ లేవని, కేవలం ట్రిక్కులు మాత్రమే ఉంటాయని అవగాహన కల్పించారు. విద్యార్థులతో చిన్న చిన్న మ్యాజిక్ అంశాలు ప్రదర్శింపజేసి దానిలోని రహస్యాలను వివరించారు. కార్యక్రమంలో కె.బ్రహ్మానందం, మోహన్, దీపా, జాకబ్, జస్వంత్ పాల్గొన్నారు



విద్యార్థులకు పేపర్‌తో పువ్వుల తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రసాద్

సమగ్ర శిక్షలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా సమగ్ర శిక్ష గుంటూరు కార్యాల యంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఒ), ప్లానింగ్, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ పోస్టులకు విదేశీ సర్వీసు నిబంధనలు, షరతులపై పనిచేయటానికి అర్హత కలిగిన ప్రభుత్వ, జెడ్పీ హైస్కూల్స్, మున్సిపల్ పాఠశా లల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జిటిల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఒ ఒక ప్రకటనలో కోరారు. నోటిఫికేషన్ తేదీ నాటికి దరఖాస్తు చేసే వారు 55 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని, ఏఎస్ఎం, ప్లానింగ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పోస్టులకు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 5 సంవత్సరాల సర్వీసు కలిగి ఉండాలని, ఎస్‌జిటి కేడర్‌లో 8 సంవత్స రాల సర్వీసు కలిగి ఉండాలన్నారు. అలాగే గణితం, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులతో పోస్టు గ్రాడ్యు యేషన్ కలిగి, కంప్యూటర్స్‌లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా సంస్థల నుండి పిజిడిసిఎ/ డిసిఎ డిప్లోమా కలిగి ఉండాలన్నారు. దరఖాస్తులను ఈనెల 14 నుండి 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా పూర్తిచేసి, సమగ్ర శిక్ష కార్యాలయంలో అందచేయలని తెలిపారు. పూర్తి వివరాలకు samagrasikshaguntur.blogspot.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

గుంటూరు అభివృద్ధికి చేయూత అవసరం

లోకేష్‌ను కలిసిన మేయర్ కోవెలమూడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని జిల్లా కేంద్రంగా ఉన్న గుంటూరు అభివృద్ధికి కృషి చేయాలని ఇందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. బుధవారం ఆయన ఉండవల్లిలో మంత్రి నారా లోకేష్‌ను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. నగరాభివృద్ధి పై మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. గుంటూరు నగరం అమరావతి రాజధానిలో భాగంగా ఉన్నందున అభివృద్ధి పనులు వేగవంతంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాలు ఎంతైనా అవసరం ఉందన్నారు. లోకేష్ మాట్లాడుతూ గుంటూరు నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున పూర్తి మద్దతు ఉంటుందని, రాజధానిలో భాగమైన గుంటూరు నగరం కూడా అభివృద్ధి పథంలో ముందుండాలని ప్రభుతం చేపట్టే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మన మిత్ర యాప్ ద్వారా ప్రజలకు మెరుగైన మరియు త్వరితగతిన సేవల అందేలా చర్యలు తీసుకున్నామని, ఈ సేవలు ఇంకా ప్రజలకు చేరువ కావడానికి కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం అందించే పథకాలు వాస్తవ లబ్దిదారులకు అందేలా చూడా లన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు మన్నవ వంశీ, విక్రమ్ పెద్ది, కన్నెగంటి బాలు పాల్గొన్నారు.



లోకేష్‌ను కలిసిన మేయర్ కోవెలమూడి తదితరులు